క్లుప్తంగా

ఫారెస్ట్ చెక్ పోస్ట్ ప్రారంభం



చెక్‌పోస్ట్‌లో పూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని తోటకనుమ పంచాయతీ కస్తూరినగరంలో గురువారం ఫారెస్ట్ చెక్‌పోస్టును జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, అటవీ సంపదను కాపాడుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సొమ్ముకు గండి పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

పాముకాటుకు రైతు మృతి



చౌడేపల్లె: పాము కాటుకు గురై రైతు మరణించిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. చారాల పంచాయతీ జంగాలపల్లెకు చెందిన అగ్గిదేవత ముని వెంకటరమణ(47) గ్రామ సమీపంలోని దొనబండ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పనుల్లో ఉన్న అతడిని పాము కాటేయడంతో అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరాడు. గ్రామస్తుల సమాచారంతో అతడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన పుంగనూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అన్నదానం

వి.కోట: నెలవారీ కార్యక్రమంలో భాగంగా లయన్స్‌క్లబ్ సభ్యులు గురువారం స్థానిక కేజీఎఫ్ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. క్లబ్ సభ్యుల జన్మదినం పురస్కరించుకుని ఇలా చేయడం పరిపాటి. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ లోకేష్, సభ్యులు సురేంద్రగౌడు, ఎధీరజ్, నాగరాజేంద్ర, షబ్రీష్, రమేష్, గిరిధర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కడపనత్తంలో చెస్ పోటీలు



చెస్ పోటీలో ఆడుతున్న విద్యార్థులు

బైరెడ్డిపల్లె: జాతీయ చెస్ డే సందర్భంగా మండలంలోని కడపనత్తం జెడ్పీ హైస్కూలులో గురువారం విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన హర్షవర్ధన్, దేవేంద్ర, భావన, జననికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, పీడీ చిరంజీవి, ఉపాధ్యాయులు బాలాజి, వెంకటేష్, హరీష్ పాల్గొన్నారు.

రాగి సాగుపై అవగాహన



రాగులను పంపిణీ చేస్తున్న అధికారులు

సదుం: మండలంలోని గుండ్లూరువారిపల్లె రైతులకు జిల్లా వనరుల కేంద్రం(చిత్తూరు) ఏఓ లక్ష్మీప్రసన్న రాగిపంట సాగుపై గురువారం అవగాహన కల్పించారు. రాగి సాగు పద్ధతులను, ఉపయోగాలను వివరించారు. జీ–20 మిషన్ లైఫ్ ద్వారా సాగునీరు, ఇంధన వాడకంలో జాగ్రత్తలను తెలియజేశారు. రాయితీపై రాగి విత్తనాలను పంపిణీ చేశారు. వీహెచ్ఏ స్వర్ణలత, భారతి, దామోదర్‌రెడ్డి, పూర్ణిమ, కుమారి, గీత పాల్గొన్నారు.

వీఆర్ఏల ఆందోళన



పలమనేరు: తమ సమస్యల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘ మండల అధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, తమకు పే స్కేల్ వర్తింపజేయాలని, అరవై ఏళ్లు దాటిన వీఆర్ఏలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఆ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, వీఆర్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, మనోహర, సుజాత, లావణ్య, వ్యవసాయ కార్మికసంఘ నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

22న ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: ఈనెల 22న ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు నాగరాజా, మునస్వామి మొదలియార్ విలేకరులకు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ప్రతినెల 4వ శనివారం కంటి వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. కంటిజబ్బులు కలిగిన వారికి శిబిరంలో చికిత్స చేసి, చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు.

'సురక్ష'తో సమస్యల పరిష్కారం

- మీడియా సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతిపురం: దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. గురువారం శాంతిపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లంచాలకు, ఆలస్యానికి అవకాశం లేకుండా సేవలు అందుతున్నాయన్నారు. జిల్లాలోని 5,84,992 కుటుంబాలలో 3,82,559 గృహాల సర్వే పూర్తయ్యిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,21,974 వినతులు, పట్టణ ప్రాంతంలో 24,462 వినతులు అందాయని, ఇప్పటి వరకూ 1,39,305 సేవలు లబ్ధిదారులు పొందారన్నారు. ప్రతి పంచాయతీలో వందల సంఖ్యలో అర్జీలు రావడం చూస్తుంటే కుప్పం ప్రజలను చంద్రబాబు ఇంత కాలం ఎంత మోసం చేస్తున్నారో తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో జగనన్న సురక్ష అమలులో జిల్లా 10వ స్థానంలో ఉందన్నారు. సురక్షపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మరో రెండు నెలల్లో హంద్రీ–నీవా నీటిని కుప్పం కాలువకు విడుదల చేసేందుకు సీఎం వస్తారని చెప్పారు. ఈ ప్రాంతంలోని 47 చెరువులకు నీరు ఇవ్వడంతో పాటు కుప్పానికి 24 గంటలు నీటి సరఫరా ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. చంద్రబాబు, ఆయన కొడుకు తమ పార్టీ వారిని తిట్టడంలో పోటీ పడుతున్నారని, మీడియాను అడ్డుపెట్టుకుని చెడును మంచిగా, మంచిని చెడుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ఓటమి భయంతోనే లక్ష మెజారిటీ మాటలు

చంద్రబాబునాయుడుకు కుప్పంలో ఓటమి భయం పట్టుకుందని, అందుకే లక్ష ఓట్ల మెజారిటీ అంటూ జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2009 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా బాబు మెజారిటీ తగ్గుతోందని చెప్పారు. 2009లో 59,588 ఓట్ల మెజారిటీ వస్తే నాలుగు ఎన్నికల్లో అది 30,722కు పడిపోయిందన్నారు. 2019లో తమ పార్టీ అభ్యర్థి చంద్రమౌళి ఆస్పత్రిలో పడకకే పరిమితం కావడం వల్లే చంద్రబాబు 30 వేలతో గెలిచారని చెప్పారు. 2019లో బాబు కుప్పం నుంచే పోటీ చేసి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కోరారు. ప్రజలందరి ఆశీర్వాదంతో చంద్రమౌళి తనయుడు భరత్‌ను కుప్పంలో బాబుపై గెలిపిస్తామన్నారు. కుప్పం స్థానిక ఎన్నికల్లో 90 శాతం, మున్సిపాలిటీలో 25కు 19 వార్డులు వైఎస్ఆర్‌సిపి సాధించిందన్నారు. మిగిలిన ఎమ్మెల్యేని కూడా సునాయసంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

బాబు కుట్రతో 6 లక్షల దొంగ ఓట్లు

కుప్పంలో కుప్పలుగా దొంగ ఓట్లను చూశాక రాష్ట్రంలో గమనిస్తే 60 లక్షల దొంగ ఓట్లు ఉన్నట్టు తేలిందన్నారు. 2019 ఎన్నికల ముందు ఇవన్నీ చంద్రబాబు డైరెక్షన్‌లో ఓటర్ల జాబితాల్లో చేరాయన్నారు. వీటిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఎమ్మెల్యేలను అప్రమత్తం చేశామన్నారు. తప్పును దిద్దే ప్రయత్నం చేస్తుంటే తమ దొంగ ఓట్లు కాపాడుకోవడానికి టీడీపీ రాద్ధాంతం చేస్తోందన్నారు. కుప్పంలో ఇప్పటికే 12 వేల ఇతర రాష్ట్రాల వారి ఓట్లను తొలగించగా, మిగతా 25 వేల దొంగ ఓట్లను కూడా ఎన్నికల కమిషన్ జల్లెడ పడుతుందన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే వెంకటేగౌడ, టీడీపీ బోర్డు సభ్యుడు పోకల అశోక్, నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్ప, మొగసాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పేదలకు పథకాలు

శాంతిపురం: టీడీపీ ఓటు వేసిన వారికి మాత్రమే జన్మభూమి కమిటీల సిఫార్సులతో గత ప్రభుత్వంలో పథకాల ఫలాలు అందితే ఇప్పుడు కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వం మేలు కల్పిస్తోందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గురువారం పల్లెబాట కార్యక్రమంలో మండలంలో పర్యటించిన ఆయన పలు ప్రారంభోత్సవాలు చేసి మాట్లాడారు. 121పెద్దూరు, బోయనపల్లెలో నూతన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. 64 పెద్దూరులో అంకాలమ్మ ఆలయానికి తన సొంత నిధులు రూ లక్షను ఇస్తామని ప్రకటించారు. రాళ్లబూదుగూరులో కోదండరామస్వామి ఆలయానికి రూ.10 లక్షలు, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10 లక్షలు, ముస్లిం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.25 లక్షలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



పెద్దూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఆయా సందర్భాలలో మంత్రి మాట్లాడుతూ, కుప్పంలో ఎమ్మెల్యేగా భరత్ గెలుపును రాష్ట్ర ప్రజలు కోరుకొంటున్నారని చెప్పారు. కరోనా కష్టకాలంలో భరత్, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తే చంద్రబాబు, ఆయన కొడుకు మాత్రం హైదరాబాదులో దాక్కున్నారని అపహాస్యం చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ గోవిందప్పశ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే వెంకటేగౌడ, పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, స్థానిక నాయకులు కోదండరెడ్డి, శ్రీనివాసులు, బుల్లెట్ దండపాణి, చక్రపాణిరెడ్డి, వనితశీను, చంగప్ప, పెద్దన్న, కృష్ణమూర్తి, నాగభూషణమ్మ, సుకుమార్, నందకుమార్, శ్రీనివాసమూర్తి, వీరబద్రప్ప, ఆరెళ్ల జయప్ప తదితరులు పాల్గొన్నారు.

పొలాల దారి గొడవ

- చంపేస్తామంటూ బెదిరింపులు
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

గంగవరం: పొలాల దారి విషయమై ఇరు వర్గాల మధ్య కొంతకాలంగా ఘర్షణల నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తిని మరో వర్గం చంపేస్తామంటూ బెదిరించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం..మండలంలోని దండపల్లె పంచాయతీ జోగిండ్లుకు చెందిన దేవరాజులు దండపల్లెలో పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్నాడు. స్వగ్రామంలో తన పొలం వద్ద పక్క పొలంలోని కొంత భాగాన్ని డి.కురప్పల్లెకు చెందిన వెంకటరమణగౌడు కుటుంబ పెద్దల నుంచి అప్పట్లో కొనుగోలు చేశారు. అయితే పొలంలోకి దారి లేదంటూ తమ కుటుంబ పెద్దల కాలంలో అమ్ముకున్న భూమిని వదిలేయాలంటూ దేవరాజులుపై వెంకటరమణ చాలాసార్లు దౌర్జన్యం చేశాడు. దీనిపై సివిల్ కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం వెంకటరమణ, తన అనుచరులతో కలిసి దేవరాజులుతో గొడవపడ్డాడు. హతమారుస్తామంటూ బెదిరించడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ధరకే నాణ్యమైన కందిపప్పు



కందిపప్పు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అలీమ్‌బాషా

పుంగనూరు: ప్రభుత్వం నిర్దేశించిన ధరకు నాణ్యమైన కందిపప్పును పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో కోర్టు బైపాస్ రోడ్డులో ప్రభ దాల్‌మిల్ సెంటర్‌లో కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రభ దాల్‌మిల్ యాజమాన్యం ప్రభుత్వ ధరలకు కందిపప్పును పంపిణీ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజలకు రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా కందిపప్పు కిలో రూ.140లకే ఇస్తారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి , తహసీల్దార్ సీతారామన్, వైఎస్సార్ సీపీ నాయకుడు అస్లాం మురాది పాల్గొన్నారు.

5 లీటర్ల సారా స్వాధీనం

రొంపిచెర్ల: సారా స్వాధీనం చేసుకుని పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. గురువారం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు..అందిన సమాచారం మేరకు మండలంలో పెద్దగొట్టిగల్లులోని భాస్కర్ రెడ్డి పొలం వద్ద పోలీసులు కాపు కాశారు. బలిజపల్లెకు చెందిన శ్రీనివాసులు(44) ఒక సంచితో రోడ్డు మీదకు రాగా పోలీసులు నిలువరించి తనిఖీ చేశారు. బ్యాగులో 5 లీటర్ల సారా ఉన్నట్టు గుర్తించి, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై తనిఖీలు

పలమనేరు: పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, స్వీట్ స్టాళ్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయాలపై స్థానిక మున్సిపల్ శానిటేషన్ అధికారులు సచివాలయాల సిబ్బందితో కలసి గురువారం తనిఖీలు చేశారు. స్థానిక సెల్వం స్టోర్స్‌లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను సీజ్‌చేసి రూ.2500 జరిమానా విధించినట్టు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ తెలిపారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

పలమనేరు: ప్రభుత్వ నిబంధనల మేరకు కోడిగుడ్ల బరువు ఉండాల్సిందేనని, దీనిపై హెచ్ఎంలు పర్యవేక్షించాలని పలమనేరు ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని వారు తనిఖీ చేశారు. నిబంధన మేరకు కోడిగుడ్ల బరువు ఉందని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను స్కూళ్లలో చేర్పించాలి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని స్కూళ్లలో చేర్పించాలని ఎంఈఓ సిద్ధరామయ్య ఆదేశించారు. గురువారం ఎంఆర్‌సీలో ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో 151 మంది బడి మానిన బడి ఈడు పిల్లలు ఉన్నట్లు గుర్తించామని, వీరందరినీ ఆయా పాఠశాల పరిధిలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓ–2 తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

2,525 మందికి 'జగనన్న సురక్ష' ధ్రువపత్రాలు



రొంపిచెర్ల : బండకిందపల్లెలో..



సోమల: పొదలగుంటపల్లెలో..



చౌడేపల్లె : ఏ.చింతమాకులపల్లెలో..



సదుం: ఊటుపల్లెలో..



పలమనేరు : మొరంలో..



పెద్దపంజాణి: పెద్దకాప్పల్లెలో..



గుడుపల్లె : యామగానిపల్లెలో..

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో 380 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువ పత్రాలను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీటీసీ లక్ష్మి, సర్పంచ్ సుష్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పొదలగుంటలో 350 మందికి..

సోమల: మండలంలోని పొదలగుంటపల్లెలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో 350 లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను ఎంపీపీ ఈశ్వరయ్య, మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, సర్పంచులు జయరాం, వెంకటరమణ తదితరులు పంపిణీ చేసి మాట్లాడారు. మండల స్పెషలాఫీసర్ శివకుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, ఆర్ఐ సుబుక్తుల్లా, ఏఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి జైశంకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు,

ఏ.చింతమాకులపల్లెలో 56 మందికి..

చౌడేపల్లె: మండలంలోని 29 ఏ.చింతమాకులపల్లె గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 56మందికి వివిధ ధ్రువపత్రాలను ఎంపీపీ రామ్మూర్తి, స్పెషలాఫీసర్ ప్రసాద్ తదితరులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచ్ హైమావతి, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు పాల్గొన్నారు.

ఊటుపల్లెలో 136మందికి..

సదుం: ఊటుపల్లె సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్షలో 136మంది లబ్ధిదారులకు ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ధ్రువపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, రెడ్డెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప, స్పెషలాఫీసర్ వెంకటరమణ, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మొరంలో 245 మందికి..

పలమనేరు: మండలంలోని మొరంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 245మందికి వివిధ ధ్రువపత్రాలను గ్రామ సర్పంచ్ విశ్వనాథరెడ్డి పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ గజేంద్ర, పార్టీ మండల కన్వీనర్ బాలాజినాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సచివాలయాల కన్వీనర్ తిరుమల, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పెద్దకాప్పల్లెలో 445మందికి..

పెద్దపంజాణి: పెద్దకాప్పల్లె సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్షలో 445 మంది లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, జెడ్పీటీసీ సుష్మకీర్తి తదితరులు పంపిణీ చేశారు. తహసీల్దార్ లోకేశ్వరరావు, సర్పంచ్ చంద్రమోహన్, ఎంపీటీసీ పావని, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, లాయర్ భాస్కర్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రవికుమార్, పీఎస్ విశ్వమాలిని, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె మండలంలో 913 మందికి..

గుడుపల్లె: యామగానిపల్లె, పాగురుపల్లెలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 913 మంది లబ్ధిదారులకు ఎంపీపీ వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ రామకృష్ణ తదితరులు ధ్రువ పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. అత్యధికంగా కుల ధ్రువీకరణ పత్రాలు 363 ఇచ్చినట్లు చెప్పారు. జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, నాయకులు గోపి, శ్రీనివాసులు, ఈశ్వర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో కొండంత భరోసా



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

–'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలకు కొండంత భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే వెంకటేగౌడ పునరుద్ఘాటించారు. గురువారం ఆయన కీలపల్లె గ్రామ సచివాలయ పరిధిలో బాలేపల్లె, పొన్నమాకులపల్లె, జెఆర్ కొత్తపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

కీలపల్లెలో మురుగునీటి కాలువలు, రెండు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని, పొన్నమాకులపల్లెలో రెండు వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని, ఒకచోట కరెంటు స్తంభం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అయితే గ్రామాల్లో ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేయాలనే దానిపై సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద సరైన సమాచారం లేకపోవడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు.

జెడ్పీ హైస్కూలులో..

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా ఉండేలా తమ ప్రభుత్వం తీర్చిదిద్దిందని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. పొన్నమాకులపల్లె జెడ్పీ హైస్కూల్‌ని సందర్శించిన ఆయన కొంతసేపు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం డిజిటల్ క్లాస్ రూంని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి, ఎంపీటీసీ నాగేంద్రరెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి, గిరిరాజారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా సైదుల్లా దర్గా



సైదుల్లా దర్గా వద్ద సొరంగం వద్ద పరిశీలిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు సమీపంలోని సైదుల్లా దర్గాను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో పర్యాటక కేంద్రంగా చేస్తామని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం అటవీశాఖ సిబ్బందితో కలిసి సైదుల్లా దర్గాను ఆయన సందర్శించారు. దర్గా వద్ద సొరంగాన్ని పరిశీలించారు. ఎవరూ అందులోకి దిగకుండా ఉండటానికి చుట్టూ రాతి కట్టడం కట్టినట్లు ముస్లింలు చెప్పారు. దర్గా ప్రత్యేకత గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతం ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉందని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడి చిత్తూరు జిల్లాలో కలపాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ సీసీఎఫ్‌ను కోరారు. చిత్తూరు డీఎఫ్ఓ చైతన్య కుమార్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్ బాలకృష్ణా రెడ్డి, నాదమునిరెడ్డి, సర్పంచ్ షుకూర్, గోవిందరెడ్డి, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి, హజరత్ చోటూసాహెబ్ పాల్గొన్నారు.

27 నుంచి మంత్రి 'వార్డు బాట'



వార్డుబాట కార్యక్రమంపై మాట్లాడుతున్న కొండవీటి నాగభూషణం

పుంగనూరు: రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు మున్సిపాలిటీ వార్డుబాట నిర్వహించనున్నారని, ప్రతి ఒక్కరూ దీనిని జయప్రదం చేయాలని రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం కోరారు. గురువారం మున్సిపాలిటిలో చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 27న ఉదయం హనుమంతరాయదిన్నె వద్ద వార్డు బాట ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి, నివేదికలు మంత్రికి అందజేసి, తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సురేష్

రొంపిచెర్ల: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సమీరాబేగం, మెహాంక్‌కు విశ్రాంత ప్రిన్సిపల్ రమేష్ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు చట్నా నారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు రమేష్, సురేష్ గురువారం రొంపిచెర్ల బాలుర, బాలికల, ఉర్దూ ఉన్నత, తెలుగు ప్రాథమిక పాఠశాలలో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. 14 మంది పేద విద్యార్థులకు రూ.1116 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో చట్నా సురేష్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, లక్ష్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొరబాట్లకు తావివ్వకుండా ఓటర్ల జాబితా

- పలమనేరు ఆర్డీఓ శివయ్య



మాట్లాడుతున్న ఆర్డీఓ శివయ్య

పలమనేరు: ఓటర్ల జాబితాలో పొరబాట్లకు తావివ్వకుండా చేయడానికి రాజకీయపార్టీల పాత్ర కూడా ముఖ్యమని పలమనేరు ఆర్డీఓ శివయ్య అన్నారు. ఓటర్ల జాబితా విషయమై గురువారం తన కార్యాలయంలో ఆర్డీఓ వివిధ రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మూడునెలల పాటు ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 287 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. వీటి పరిధిలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని వ్యక్తులు ఉన్నారా, లేదా? అని తెలుసుకుంటారన్నారు. వారి ద్వారా ఏవైనా మార్పులు–చేర్పులు, సవరణలు సైతం చేసుకోవచ్చని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, బీఎస్పీ, కాంగ్రెస్ తదితర పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని ఓటర్ల జాబితాలో సవరణలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ చిట్టిబాబు కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన అఖిల పక్షం సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటర్ల గుర్తింపు కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు, తొలగింపులు, సవరణలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలగురునాథ్, రంగనాథ్, ఇనాయతుల్లా, బాబు, వినోద్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలతో అభివృద్ధి చెందండి



స్వయం సహాయక సంఘాలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ జీఎం సంజయ్‌కుమార్

పెద్దపంజాణి: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ శ్రీరామాపురంలో గురువారం మెగా లోన్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన గ్రూపు సభ్యులకు చెక్కును అందజేసి మాట్లాడారు. తమ బ్యాంకు అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఆర్ఎం వంశీ కిషోర్ కుమార్ రెడ్డి, పుంగనూరు బ్రాంచ్ మేనేజర్ నరసింహులు, ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శంకరప్ప, ఏపీఎం క్రిష్ణప్ప, ఎంపీటీసీ గురుమూర్తి, సర్పంచులు భాస్కర్, అర్చన తదితరులు పాల్గొన్నారు.